# బంధం

దైన్యానికి నీరుకావి పంచె కట్టి, మాసిపోయిన చొక్కా తొడిగినట్లున్న బక్కచిక్కిన మానవాకారం తననే పిలుస్తున్నట్లనిపించి, ఆ గుడి మండపంలో ఒక చోట కూర్చున్న రాంబాబు అతని దగ్గరకెళ్ళి ఏమిటన్నట్లు చూశాడు.

బలహీనమైన గొంతుతో..." నిన్ను..ఇందాకటనుండీ సూస్తున్నాను. ఆకలిగా ఉన్నట్లనిపిస్తోంది...పూజారిగారు పెసాదం పంచిపెడతన్నారు...తెచుకుని తిను బాబూ..."

రాంబాబు అతనివైపు విస్మయంగా చూశాడు. ఏదో సమస్యతోనో, వ్యధతోనో సతమతమౌతున్నట్లుగా కనిపిస్తున్న ఈయన...దూరంగా కూర్చున్న తనలోని ఆకలిని ఎలా గుర్తించాడు ? పాపం...అతనికీ ఆకలిగా ఉండిఉంటుంది....పూజారి దగ్గరకు వెళ్ళటానికి ఒళ్ళో పడుకుని ఉన్న పిల్లాడు లేవనియ్యటం లేదేమో...అనుకుంటూ చటుక్కున వెళ్ళి బాదం ఆకులో పెట్టి ఇస్తున్న పొంగలి ప్రసాదాన్ని తెచ్చి...అతనికీ ఇవ్వబోయాడు.

అతను వద్దన్నట్లుగా తల అడ్డంగా వూపుతూ..." నేను తినలేను...సయించదు.." అనగానే అతని ఒడిలో ఉన్న బిడ్డ వైపు రాంబాబు చేయి చూపించాడు.

" ఆడికీ జొరం బాబూ...ఏమీ తినలేడు....నువ్వు సిన్నోడివేగా, ఆకలిగా ఉన్నావనిపించి..పైగా సూస్తుంటేనే, మాలాంటి పేదరికం నెత్తిన పెట్టుకుని తిరిగే బాపతు మనిషివేనని తెలుస్తుంది..అందుకే అటు సూడలేదేమోనని, నీకే సెప్పాను..." అన్నాడతను.

అలాంటి దీనావస్థలో ఉండి కూడా, తన పట్ల ఎంత ఆరా చూపించాడూ...! ఆశ్చర్యపోయాడు రాంబాబు.

రాంబాబు అక్కడే అతని పక్కన కూర్చోబోతోంటే...అతను కంగారుగా " కూసింత దూరంగా కూర్చో నాయనా...అటు.." అన్నాడు.

రాంబాబు అతని మాటలకు వింతగా చూశాడు.

తన కులమేమిటో తెలియదు...పైగా తింటోంటే, మెతుకులు అవీ పడతాయేమోనని భయపడ్డాడా...?!

ఎంత లేమిలో ఉన్న వాళ్ళకైనా...కులం, అంటు - సొంటు లాంటివాటి పట్టింపులు మాత్రం తప్పవా...? విచిత్రంగా అనిపించి తనలో తనే నవ్వుకున్నాడు.

తినటం ముగించి, చేతులు కడుక్కుని వచ్చి...ఒక స్థంభానికి జేరగిలబడి కూర్చున్న రాంబాబుకి అతనిని చూస్తుంటే, తన తండ్రి గుర్తుకు వచ్చాడు.

రోజంతా కష్టపడి పనిచేసినా అలుపన్నదే ఎరగనట్లు ఎంత హుషారుగా ఉండేవాడు...అందుకే, ఏమి ఉన్నా లేకపోయినా చీకూ - చింతా లేనట్లు ఉత్సాహం వెల్లివిరుస్తూండేది ఇంట్లో...!

అమ్మా నాన్నలు చూపించే గారాబం ముందు....పేదరికమనేది తనను వేధించేది కాదు. అలాంటి తల్లీ తండ్రీ...ఒక్కసారే తనని దురదృష్టవంతుడిని చేసి, ప్రమాదానికి లోనై పరలోకానికి వెళ్ళిపోయారు.

పది పన్నెండేళ్ళ వయసులోనే అనాధగా మిగిలిన తను కొందరు పుణ్యాత్ముల దయ వలన...చిన్నా చితకా పనులు చేసుకుంటూ...చదువు మాత్రం మానకుండా రోజులు నెట్టుకొచ్చాడు.

ఈ మధ్యనే ...ఒక గొప్ప వారింట్లో వాచ్ మేన్ గా వుంటున్న తను తనకి ఆశ్రయం ఇచ్చాడు. అతనుండే అవుట్ హౌస్ వరండాలోనే తనుండటానికి చోటు దక్కింది.

అతని పనుల్లో వీలున్నప్పుడల్లా భాగం పంచుకుంటూ...పెట్టింది తిని కాలేజీలో చేరాడు. అలా ఓ రెండేళ్ళు గడిచిపోతే చాలని నిశ్చింతగా ఉంటున్న తనని మళ్ళీ ఆ రోజు దురదృష్టం కాటేసింది !

మొక్కలకు నీళ్ళు పెట్టటం పూర్తి చేసిన తను, పక్కింట్లో ఏదో గలాటా వినిపించి, పిట్టగోడ దగ్గరకు చేరాడు.

రెండు మూడు రోజుల క్రితమే...వాళ్ళబ్బాయికి పే..ద్ద శాలరీతో మంచి ఉద్యోగం వచ్చిందని తెలుసు. చాలామంది బంధు మిత్రులు వచ్చి అభినందనలు తెలియజేస్తూండటం వలన వారింట్లో ఒకటే కోలాహలం, సందడీ !

ఆ రోజు...ఆ అబ్బాయి అమ్మమ్మో, నానమ్మో అయిన ఓ పెద్దావిడ వాళ్ళింటికి వచ్చినట్లుంది...రాగానే ఇంటి వరండాలోనే ఆవిడ...ఆ అబ్బాయిని అక్కున చేర్చుకుని ' నీకెంత కష్టం వచ్చిందిరా బాబూ...' అంటూ దీర్ఘాలు తీస్తుంటే...ఆ అబ్బాయి తల్లీ, తండ్రీ...' వాడికెంత గొప్ప ఉద్యోగం వచ్చిందోనంటూ అందరూ ఒకటే మెచ్చుకుంటుంటే...కష్టం అంటూ ఈ రాగాలు ఏమిటీ.." అంటూ చిరాకు పడ్డారు వాళ్ళు.

' మొన్న మొన్నటి వరకూ ...పసివాడిని..మెడతిప్పి చూడనివ్వకుండా ...పుస్తకాలు ముందేసి కూర్చోబెట్టి, ర్యాంకు రావాలంటూ మీరిద్దరూ కాపలా కాస్తూ పేధించారా...ఇపుడు చదువు పూర్తవ్వగానే...వెతుక్కుంటూ గొప్ప జీతంతో మంచి ఉద్యోగం వచ్చిందని మురిసిపోతున్నారేగానీ, మీకసలు విషయం అర్థం కావటం లేదు...! పిండి కొద్దీ రొట్టె అన్నట్లు...అంత జీతం ఇస్తున్నవాళ్ళు ఊపిరి సలపని పని అప్పజెప్పరూ...! చదువుతోనూ క్షణం తీరిక లేక, వెంటనే, ఇపుడు ఉద్యోగంతోనూ వాడు ఉక్కిరిబిక్కిరి అయిపోడాంట....వాడి జీవితం ఇలా అయిపోయిందని దుఃఖం వచ్చేసింది.. పసివాడి మీద తలకు మించిన భారం పడిందనీ....! " అంటూ ఆవిడ మళ్ళీ ముక్కు, కళ్ళు తుడుచుకుంది.

'అబ్బ...! హడలగొట్టావు కదమ్మా..ఇదా సంగతీ...' అంటూ ఆ అబ్బాయి తల్లీ, తండ్రీ ఫక్కున నవ్వారు.

ఇదంతా చూస్తున్న తనకీ నవ్వొచ్చి...నవ్వుకుంటూనే గోడ వైపు నుండి వెనుదిరిగాడు.

సరిగ్గా అప్పుడే....అటు పక్కనుండే వాళ్ళమ్మాయి...గోడవారగానున్న వాళ్ళింట్లో మొక్కల పూలు కోస్తోంది...!

ఆ అమ్మాయి వెనకే, వాళ్ళమ్మ నిలబడి వుంది !

తను వెనక్కి తిరిగి నవ్వుతూండటం చూసిన ఆవిడ ...వాళ్ళమ్మాయిని చూసేనని తీర్మానించేసింది ! పైగా అలా చాలాసార్లు జరగటం తను గమనించానంటూ చిందులు తొక్కి...తనను ఆ ఇంటినుండి వెంటనే పంపిచాలనీ, తనలాంటి పోకిరీ వాళ్ళు ఉండటం ప్రమాదమనీ కూడా తానుంటున్న యజమానురాలినీ హెచ్చరించటంతో....తనకు ఉద్వాసన తప్పలేదు. ఆ ఇంటిగలావిడ, వాచ్ మేన్ కూడా కొంచెం జాలి చూపించి రెండు రోజుల్లో ఎక్కడైనా ఆశ్రయం చూసుకొమ్మని చెప్పేశారు.

ఆ అమ్మాయి అంతకుముందు తనని చూసి నవ్విందో లేదో తనకు తెలియనే తెలియదు. అయినా అటువంటి నిందారోపణ భరించాల్సి రావటం అవమానంగా అనిపించి...రోషంతో రెండు సంచుల్లో ఉన్న రెండు జతల బట్టలు, పుస్తకాలతో బయటకు వచ్చేశాను. రావటం అయితే వచ్చేశాడుగానీ, ఎక్కడికెళ్ళాలో తోచక, ఊరంతా తిరిగి...నిస్త్రాణగా ఆ గుడి మండపంలో కూర్చోవటం జరిగింది.

రాంబాబుకి అపుడు స్కూలులో ఒకసారి మాష్టారెవరో చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. ' కొందరు తమ మాటలతో ఆదరం చూపించి, మనసులను దగ్గర చేయగలుగుతారట. వాళ్ళను సూదితో పోల్చితే, కొందరు కత్తెర లాంటి వాళ్ళుంటారు...విడదీయటమే వాళ్ళ పని !

తన ఆకలి పట్ల ఆరా చూపించిన అతను సూదిలాంటివాడేనని రాంబాబుకు అనిపించింది.

ఆ చిన్న మాటతోనే అతనితో తనకేదో బంధమేదో ఏర్పడినట్లయింది. ఒడిలో పిల్లాడితో కొంచెం ఇబ్బందిగా కదులుతున్నట్లనిపించి....' నేనా పిల్లాడిని కాసేపు పట్టుకుంటాను. మీరు విశ్రాంతిగా కొంచెంసేపు జారగిలబడటం బావుంటుంది ' అంటూ నసుగుతున్నట్లు మెల్లగా అన్నాడు.

" అయ్యో...అలా దగ్గరకు రాబాకు బాబూ..మా ఊరికి బాగా దగ్గరకు వచ్చేసాను. ఇక బయలెల్లిపోతా..." అంటూ లేచి పిల్లాడిని భుజాన వేసుకునేసరికి, రాంబాబు కి ఇంకా ఆశ్చర్యంగా అనిపించింది.

అతనిదీ ఊరు కాదా..ఎక్కడికి వెళ్ళి పిల్లాడితో తిరిగి వెళ్తున్నాడూ...? ఏదైనా బండిలో కాకుండా, కాలినడకన...అంత బరువుతో ఆ బక్కచిక్కిన మనిషి ఎలా నడవగలుగుతున్నాడూ...?

" నేను కాసేపు ఆ బాబుని ఎత్తుకుని మీతో వస్తాను.." అంటూ వెంట నడిచాడు.

" వద్దు...దగ్గరకు రాబాకు బాబూ...ఈడికి జ్వరం బాగా వుంది..! " అంటూ అతను అడుగులు ముందుకు వేస్తోంటే...' జ్వరం కాబట్టే నడవలేడని ఎత్తుకోవటం...పెద్దవాళ్ళకి కొంచెం కష్టం అనిపిస్తుందిగానీ, నాకేం ఫర్వాలేదు...ఎత్తుకుని నడుస్తూ తోడు వస్తాను..." అన్నాడు రాంబాబు పట్టు వదలని విక్రమార్కుడిలా.

రాంబాబు భుజాలకు ఉన్న చేతి సంచీలను చూసి నిట్టూరుస్తూ " నాకు తప్పదు. ఇది అంటు జొరమని దగ్గరగా రావద్దంటున్నాను అబ్బాయీ..." అన్నాడతను ఆర్ద్రంగా.

రాంబాబు ఆ మాట వినిపించుకోకుండాఅతనికి సాయం చేయాలనే తపనతో పిల్లాడిని అందుకోబోయే ప్రయత్నం చేస్తోంటే...అతను రాంబాబుని ఒక చేత్తో వెనక్కి నెట్టి, అక్కడున్న ఓ చెట్టు మొదట్లో కూలబడి భోరుమన్నాడు.

రాంబాబుకి మతిపోయినంత పనయ్యింది. దిగ్భ్రాంతితో చూస్తూండిపోయాడు.

అతను ఒక క్షణానికే తెప్పరిల్లి...విషయం ఏమిటో చెప్పాడు.

" ఈడికి జొరం కాదు...సచ్చిపోనాడు...దూరం నుండి ఎత్తుకుని వస్తున్నానా...నోస వచ్చినట్లయి అక్కడి జాగాలో కాసేపు కూర్చుండిపోయా. అందుకే నిన్ను దూరం పొమ్మన్నాను. పానం లేని పిల్లాడితో గుళ్ళో కూర్చోవటం తప్పు గందా... " అన్నాడు ఎక్కిళ్ళు ఆపుకుంటూ.

రాంబాబు మనసు నీరయిపోయింది. ఏ హాస్పిటల్ కి, ఎందుకు వెళ్ళాడు వంటి వివరాలు తెలుసుకుని ఇంకా విస్తుపోయాడు !

" ఏం సేసేది బాబూ....వోరం దినాలనుండి జొరం కాస్తుంటే...పైసలడిగితే, మా సావుకారు ఈయలేదు. సెలాకరుకేనని గట్టిగా సెప్పినాడు. మా ఊరి ఆచారిగారి మాత్రలు ఏస్తన్నా తగ్గటం లేదని ఈడి తల్లి గోల సేస్తే...సేసేదేం లేక, ఆయమ్మి ముక్కుపుడక తెగనమ్మి,పట్నం తీసుకుపోయా. డబ్బంతా ఆరికే అప్పగిస్తే.....కాసేపటికే చావు కబురు సల్లగా సెప్పి, పేనం లేని ఈడిని అప్పగించారు బాబూ..." అతనిలోని దుఃఖం ఇంకా వెల్లువైంది.

ఆ తరువాత...ఏం జరిగిందో రాంబాబుకు అతని మాటల ద్వారానే అర్థమైంది.

ఆ హాస్పిటల్ అంబులెన్స్ అందుబాటులో లేదు. అక్కడున్న ప్రైవేటు అంబులెన్సుల వాళ్ళు డబ్బు చేతిలో పెడితేగానీ ఎక్కించుకోమని తెగేసి చెప్పారు.

చేతిలో పైసా లేని అతను చేసేదేంలేక, పిల్లాడిని ఎత్తుకుని కాలినడకన తన వూరుకి బయలుదేరాడు. పిల్లాడి అమ్మకీ కబురెలా సెప్పాలో తెలియటంలేదని మళ్ళీ భోరుమన్నాడు.

రాంబాబు ఇక ఏం ఆలోచించకుండా, పిల్లాడిని రెండో భుజంపై వేసుకుని అతనితో కలిసి నడక మొదలుపెట్టాడు. అతను ఎంత వారించినా వినలేదు. దారిలో ఓదారుస్తూనే వాళ్ళింటి విషయాలన్నీ మాటల మధ్య తెలుసుకున్నాడు.

గుమ్మం దగ్గరే ఎదురు చూస్తున్నట్లుగా కూర్చున్న ఆవిడ ముందు ఆ ప్రాణం లేని పిల్లాడిని పడుకోబెట్టాడు.

కాసేపటి తర్వాత గుండెలవిసేలా ఏడ్చిన ఆవిడతో రాంబాబు కాసేపటి తర్వాత  చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకుంటూ చెప్పాడు. " అమ్మా...మీ దుఃఖం ఎవరూ తీర్చలేనిదే కావచ్చును గానీ....ఆ దేముడు చిన్నప్పుడు తప్పిపోయి తిరిగి వచ్చిన మీ పెద్దకొడుకుగా నన్ను పంపించాడు..! మీకు అండగా నిలబడగలను..! "

దానికి అతను ... " బాబూ...మావి రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు..." అంటూండగానే, రాంబాబు అతని చేయి పట్టుకుని " మీ బరువు పంచుకోవటానికి మాత్రమే వచ్చానుగానీ, నా బరువు మీ మీద వేయను...!" స్థిరంగా అన్నాడు.

పూడుకుపోయిన గొంతును స్వాధీనంలోకి తెచ్చుకుంటూ " బాబూ...సదూకుంటూన్న  పిల్లోడివి..మా బాదలేవో మేం పడక తప్పదు..." అంటూ నచ్చజెప్పబోయాడు.

" నా చిన్నతనంలో ప్రమాదంలో పోయిన నా తల్లిదండ్రులు నాకు దొరికారు. కడదాకా మిమ్మల్ని కనిపెట్టుకునే ఉంటానుగానీ వదిలి పెట్టను ! చదువు మాత్రం మానను...ఇంటినుండే చదూకునే సౌకర్యం ఉంది. నాలుగు రకాల పనులు చేసి అయినా...సంపాదించగలను ! తల్లీ, తండ్రీ ఉన్నారనే బంధం, బాధ్యతా ఏర్పడ్డాయి...! "

ఆ మరునాడు ...ఆ షావుకారు ఇంటి దగ్గర్నుండి ఇంకొక పాలేరు వచ్చి, కొడుకు పోయాడు కాబట్టి పనిలోకి నిన్న రాకపోయినా , ఆ రోజయినా తొందరగా రావాలని అయ్యగారు చెప్పారనే కబురు చెప్పాడు...నారయ్య కి.

రాంబాబు తనూ వస్తానంటూ అతని వెంట షావుకారింటికి బయలుదేరాడు. అక్కడ ఆ షావుకారు...." నువ్వెవడివిరా....నువ్వెందుకు వచ్చావు...నారిగాడేడీ...?" అంటూ ఆరా తీసేసరికి, రాంబాబు చేతులు కట్టుకుని వినయంగానే జవాబు చెప్పాడు. ..." నేను నారయ్య పెద్ద కొడుకునండి. మా అయ్య ఇక పనిలోకి రాడు. కష్టం వచ్చినా దయ చూపని దొర కొలువ మానాల్సిందే నని నేనే నచ్చజెప్పాను. మీరెపుడూ వినని ఓ మాట చెబుతానండి.

పిల్లల్ని దత్తత తీసుకోవటం మాత్రమే మీరు చూసి వుంటారు. నేను కొత్తగా నారయ్య దంపతుల్ని, మా అమ్మా నాన్నలుగా...బంధం ఏర్పరచుకున్నానండీ....వాళ్ళు కాలక్షేపానికి ఏ పని తేలికగా చేయగలుగుతారో , అది మాత్రమే వాళ్ళకి అప్పగించి...నేను కష్టపడి పోషణ భారమంతా చూసుకుంటాను...."

ఆయన అయోమయంగా చూసి " దీని వలన నీకేమిటీ..." అంటూ నసిగాడు.

" బంధం అనేది మనసుకి ఎంత బలం ఇస్తుందో నాకు తెలుసునండి ! ఏదైనా పోగోట్టుకున్నాకనే, దాని అసలు విలువ అర్ధమౌతుంది ! " అంటూ వెనుదిరిగి ముందుకు అడుగులు వేశాడు దయ, ధీమా కలిగిన ఆ కుర్రాడు.

*******